
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండితానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధికూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘుంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కధలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్ధాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# 11 వ భాగం

## ధ్రువోపాఖ్యానం - 3

ఇంట్లోంచి తపస్సుకోసం బయటకి వచ్చేసిన ధ్రువుడికి నారదుడు మంత్ర దీక్ష ఇచ్చాడు. ఎక్కడ తపస్సు చేస్తే మంచిదో, ఎలా చెయ్యాలో, విష్ణువు కనిపించాక ఏమి కోరుకుంటే మంచిదో కూడా చెప్పేడు. ఇప్పుడు తపస్సు ప్రారంభించేడు ధ్రువుడు.

వ. అట్లు గని డాయంజని యమునానదిం గృతస్నానుండై నియతుండును, సమాహిత చిత్తుండును నై సర్వేశ్వరుని ధ్యానంబు చేయుచుం బ్రతిత్రిరాత్రాంతంబునఁ గృత కపిత్థ బదరీ ఫల పారణుండగుచు దేహస్థితి ననుసరించి యిటుల నొక్కమాసంబు హరిం బూజించి, యంతనుండి యాఱేసి దినంబుల కొక్కపరి కృతజీర్ణ తృణ పర్ణాహారుండగుచు, రెండవ మాసంబున విష్ణుసమారాధనంబు చేసి, యంతనుండి నవరాత్రంబుల కొకమాఱుదకభక్షణంబు చేయుచు, మూఁడవ మాసంబున మాధవునర్చించి, యంతనుండి ద్వాదశ దినంబులకొకమాఱు వాయుభక్షణం డగుచు, జితశ్వాసుండై నాలవ మాసంబునం,బుండరీకాక్షుని భజియించి, యంతనుండి మనంబున నలయక నిరుచ్ఛ్వాసుండై యేకపదంబున నిలిచి, పరమాత్మఁ జింతించుచు, నచేతనంబైన స్థాణువుంబోలె నైదవ మాసంబును జరిపె; అంత. [4-270]

మొదటి నెలలో బదరీ ఫలం తినేవాడు కానీ తపస్సు పెంచే కొద్దీ అవి క్రమక్రమంగా మానేసి చివరకి స్థాణువులా అచేతనం అయిపోయేడుట. అంటే గురువు నారదుడు చెప్పిన దానికన్నా ఎక్కువ నియమ నిష్టలతో చేశాడు తపస్సు. మంత్రం ఇచ్చిన గురువూ తీసుకున్న శిష్యుడూ ఇద్దరకీ ఇద్దరే.

చ. అతఁడు నన్యదృష్టిని జరాచర దేహిశరీర ధారణా
స్థితి గల యీశునందుఁ దన జీవితమున్ ఘటియింపఁ జేసి యే
కతఁ గనఁ దన్నిరోధమునఁ గైకొని కంపము నొందె నీశ్వరుం;
డతఁడు చలింప నిజ్జగము లన్నియుఁ జంచల మయ్యె భూవరా! [4-273]

ఇలా గాలిపీల్చడం కూడా మానేసే సరికి ప్రపంచాలన్నీ తలకిందులయ్యాయి. ఇది ఎలాగంటే మీ ఇంట్లో పిల్లాడు అన్నం తినడం మానేసాడనుకోండి. ఏమౌతుంది? ఇంట్లో అందరికీ కంపరం ఎత్తిపోదూ? అలాగే వీళ్ళందరికీ అయింది. సాధారణంగా ఏ రాక్షసుడో బ్రహ్మ గురించి తపస్సు చేస్తాడు వరాల కోసం. అప్పుడు దేవతలందరూ ఆయనదగ్గిరకెళ్ళి వీడి సంగతి చూడు తండ్రీ అంటారు. కానీ ఇక్కడ ధ్రువుడు విష్ణువుగురించే తపస్సు చేస్తున్నాడు. అందువల్ల వీళ్ళందరూ ఆయనదగ్గిరకే వెళ్ళారు మొరపెట్టుకోవడానికి.

చ. హరి! పరమాత్మ! కేశవ! చరాచర భూతశరీర ధారివై
పరఁగుదు వీవు; నిట్టులుగఁ బ్రాణనిరోధ మెఱుంగ మెందు ముం
దరవుగ దేవదేవ! జగదీశ్వర! సర్వశరణ్య! నీ పదాం
బురుహములర్థిమై శరణు బొందెద మార్తి హరించి కావవే! [4-276]

బ్రహ్మజ్ఞానం వల్లే అంతులేని, ఎడతెగని సంతోషం కలుగుతుంది కానీ, ఏవో పుణ్యాలు చేసి దేవతో యక్షిణీయో అయితే సంతోషం ఉండదు. ఎందుకంటే ఇంద్రుడు కూడా ఎవరేనా తపస్సు చేస్తూంటే వణకడం మొదలుపెడతాడు తన ఇంద్రపదవికి ఎసరు వస్తుందేమో అని. అంటే ఈ బుర్ర తినేసే కష్టాలు ఎల్లకాలం ఉంటాయి బ్రహ్మ జ్ఞానం రానంతవరకూ. ఇంకో విచిత్రం ఏమిటంటే ఈ వచ్చే కష్టాలు కూడా మనం

పనికట్టుకు తెచ్చుకునేవి కాదూ, అలాగని రాగానే మనం వదిలించుకునేవీ కాదు. అవి పూర్తిగా పోవాలంటే బ్రహ్మాన్ని తెలుసుకోవడం ఒకటే మార్గం. దేవతలందరూ తమ అస్థిత్వానికి ధ్రువుడు ఎర పెడుతున్నాడేమో అని భయపడ్డారు. ధ్రువుడు చేసే తపస్సు వల్ల వీళ్ళందరికీ ప్రాణ నిరోధం అయింది. అప్పుడు విష్ణువు చెప్పేడు.

వ. అని దేవతలు విన్నవించిన నీశ్వరుండు వారల కిట్లనియె “ఉత్తానపాదుం డనువాని తనయుండు విశ్వరూపుండ నయిన నా యందుఁదన చిత్తం బైక్యంబు చేసి తపంబు గావించుచుండ, దానంజేసి భవదీయ ప్రాణనిరోధం బయ్యె; అట్టి దురత్యయం బైన తపంబు నివర్తింపఁజేసెద: వెఱవక మీమీ నివాసంబులకుం జనుం” డని యానతిచ్చిన నాదేవతలు నిర్భయాత్ములై యీశ్వరునకుఁ బ్రణామంబు లాచరించి త్రివిష్టపంబునకుం జనిరి; తదనంతరంబ. [4-277]

“ఏమీ భయంలేదు, నా భక్తుడు నన్ను చూడ్డానికి తీవ్రమైన తపస్సు చేస్తున్నాడు. నేను వెళ్ళి చూసి వస్తా మీరు వెళ్ళి సుఖంగా ఉండండి."

సీ. హరి యీశ్వరుండు విహంగ కులేశ్వర
యానుఁడై నిజభృత్యుఁడైన ధ్రువునిఁ
గనుఁగొను వేఁడుక జనియింప నా మధు
వనమున కప్పుడు చని ధ్రువుండు
పరువడి యోగవిపాక తీవ్రంబైన
బుద్ధిచే నిజమనోంబురుహ ముకుళ
మందుఁ దటిత్ప్రభాయత మూర్తి యటఁ దిరో
ధానంబునను బొంది తత్క్షణంబ [4-278]

తే. తన పురోభాగమందు నిల్చినను బూర్వ
సమధిక జ్ఞాన నయన గోచర సమగ్ర
మూర్తిఁ గనుఁగొని సంభ్రమమునను సమ్మ
దాశ్రువులు రాలఁ బులకీకృతాంగుఁ డగుచు [4-278.1]

అప్పుడు బయల్దేరేడు శ్రీహరి గరుధారూఢుడై. మనసులో కనిపించి తర్వాత తీవ్ర సమాధిలో ఉండే ధ్రువుడికి ఎదురుగా సాక్షాత్కరించేడు. ధ్రువుడికేమో ఐదేళ్ళు. ఎప్పుడూ ఏమీ చదువుకున్నదీ లేదు. శరీరం కంపిస్తూండగా కళ్ళమ్మట నీళ్ళు కారుతూంటే, "నాకు నిన్ను స్తుతించాలని ఉంది కానీ నాకేమీ రాదే' అని అలా చూస్తూ ఉండిపోయేడు.

వ. ఇట్లు దండప్రణామంబు లాచరించి కృతాంజలియై స్తోత్రంబు చేయనిశ్చయించియు స్తుతిక్రియాకరణ సమర్థుండుఁ గాక యున్న ధ్రువునకును సమస్త భూతంబులకు నంతర్యామి యైన యీశ్వరుం డాతని తలం పెఱింగి వేదమయం బయిన తన శంఖంబు చేత నబ్బాలుని కపోలతలం బంటిన జీవేశ్వర నిర్ణయజ్ఞుండును, భక్తిభావ నిష్ఠుండునునగు ధ్రువుండు నిఖిలలోక విఖ్యాత కీర్తిగల యీశ్వరుని భగవత్ప్రతిపాదితంబు లగుచు వేదాత్మకంబులైన తన వాక్కుల నిట్లని స్తుతియించె, దేవా! నిఖిలశక్తి ధరుండవు నంతః ప్రవిష్టుండవు నైన నీవు లీనంబు లైన మదీయ వాక్యంబులం బ్రాణేంద్రియంబులం గరచరణ శ్రవణత్వగాదులను జిచ్ఛక్తిచేఁ గృపంజేసి జీవింపం జేసిన భగవంతుం డవును, బరమపురుషుండవును నైన నీకు నమస్కరింతు; నీ వొక్కరుండవయ్యుమహదాద్యంబైన యీ యశేష విశ్వంబు మాయాఖ్యం బయిన

యాత్మీయశక్తిచేతం గల్పించి యందుం బ్రవేశించి యింద్రియంబు లందువసించుచుఁ ద త్తద్దేవతారూపంబులచే నానా ప్రకారంబుల దారువులందున్న వహ్ని చందంబునం బ్రకాశింతువు; అదియునుం గాక. [4-280]

భగవంతుడికి భక్తి అనేది ప్రధానం. అంతే కానీ భాష, వేదం ఎలా ఉచ్ఛరిస్తున్నాడో అనేవి అంత ప్రధానం కాదు. అవీ ప్రధానమే కానీ పరమ భాగవతోత్తములు అవి చేయలేకపోయినా పెద్ద ఇబ్బంది లేదు ఎందుకంటే వారి మనసు పూర్తిగా భగవంతుడిమీదే లగ్నం అయి ఉంటుంది కనక. అందువల్ల ధ్రువుడు అలా చూస్తూ ఉంటే – సమస్త భూతంబులకు నంతర్యామి యైన యీశ్వరుండు – అంటే మనలో ఏం జరుగుతోందో ప్రతీ క్షణం అయనకి తెలుస్తూనే ఉంటుంది కదా – విష్ణువు తన పాంచజన్యాన్ని ధ్రువుడి కపోలానికి అనించాడు. ఆ శంఖం ఎటువంటిదో ముందొక సారి చెప్పుకున్నాం గజేంద్రమోక్షంలో. ఇప్పుడు మళ్ళీ చెప్తున్నాడు పోతన – వేదమయం బయిన తన శంఖంబు అని.

చ. వరమతి నార్తబాంధవ! భవద్ఘన బోధసమేతుఁడై భవ
చ్ఛరణముఁ బొంది నట్టి విధి సర్గము సుప్తజనుండు బోధమం
దరయఁగఁ జూచురీతిఁ గనునట్టి ముముక్షు శరణ్యమైన నీ
చరణములం గృతజ్ఞుఁడగు సజ్జనుఁ డెట్లు దలంపకుండెడున్? [4-281]

అప్పుడు ధ్రువుడు సామవేదంతో శ్రీహరిని కీర్తించాడు. ఆ పలుకులెటువంటివి? నిఖిలలోక విఖ్యాత కీర్తిగల యీశ్వరుని భగవత్ప్రతిపాదితంబులగుచు వేదాత్మకంబులైన వాక్కులు. ముముక్షు శరణ్యమైన నీ పాదాలు సజ్జనుడు తలవకుండా ఉందగలడా, అంటున్నాడు.

అప్పుడనుకున్నాడు ధ్రువుడు. "అనేక మాయావిశేషాలకీ కారణమైన నీ మోముని అలా చూస్తూ ఉండాలనే తప్ప నాకింకేమి కోరికా లేదు." ఇక్కడ ధ్రువుడు మళ్ళీ తన గురువు నారదుడు చెప్పినదాన్ని తు. చ. తప్పకుండా పాటించేడు. మోక్షం తప్ప ఏమీ అడగకు సుమా అని చెప్పేడు కదా నారదుడు. విష్ణువు స్పర్శ తనకి అంటుకునే సరికి ఇంక కావాల్సినదేమిటి? అందుకే నోటమ్మట మాటరాక అలా మనసులో అనుకున్నాడు. బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు ఎలా ఉంటాడో అనే కథ చివర్లో చూద్దాం. ఇప్పుడు విష్ణువంటున్నాడు భక్తుడితో.

క. ధీరవ్రత! రాజన్య కు
మారక! నీ హృదయమందు మసలిన కార్యం
బారూఢిగానెఱుంగుదు
నారయ నది వొందరాని దైనను నిత్తున్. [4-289]

వ. అది యెట్టి దనిన నెందేని మేధియందుఁ బరిభ్రామ్యమాణ గోచక్రంబునుం బోలె గ్రహనక్షత్రతారాగణ జ్యోతిశ్చక్రంబు నక్షత్ర రూపంబులయిన ధర్మాగ్ని కశ్యప శక్రులును సప్తర్షులును, దారకా సమేతులై ప్రదక్షిణంబు దిరుగుచుందుదురు; అట్టి దురాపంబును ననన్యాధిష్ఠితంబును లోకత్రయ ప్రళయకాలంబునందు నశ్వరంబుగాక ప్రకాశమానంబును నయిన ధ్రువక్షితియను పదంబు ముందట నిరువదియాఱువేలేండ్లు చనంబ్రాపింతువు; తత్పద ప్రాప్తిపర్యంతంబు భవదీయ జనకుండు వనవాస గతుండైనం దద్రాజ్యంబు పూజ్యంబుగా ధర్మమార్గంబున జితేంద్రియుండవై చేయుదువు; భవదనుజుండగునుత్తముండు మృగయార్థంబు వనంబునకుంజని మృతుం డగు;త దన్వేషణార్థంబు తదాహిత చిత్తయై తన్మాతయు వనంబునకుంజని యందు దావదహన నిమగ్నయగు; వెండియు. [4-290]

చరాచర సృష్టిలో ఏ మూల ఏమి జరిగినా భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది అని చెప్పుకున్నాం అంబరీషోపాఖ్యానంలో. ఇప్పుడు ధ్రువుడి మనసులో కోరిక సంగతి తెల్సు కనక అంటున్నాడు భగవంతుడు, "నీ మనసులో కోరిక తెలుసు. దానిని తప్పకుండా తీరుస్తాను. గ్రహ నక్షత్ర తారాగణ జ్యోతిశ్చక్రం అంతా రాటకి కట్టబడిన దానిలా తిరుగుతూ ఉంటుంది. అది ప్రళయకాలంలో కూడా నశించేది కాదు. అక్కడకి

నువ్వు చేరుతావు అక్కడనుంచి నా మోము నీకు ఎప్పుడు కనిపిస్తూ ఉంటుంది, ఈ చక్రం ఏ వేపు తిరిగినా సరే. దీనికి ముందు – ధర్మమార్గంబున జితేంద్రియుండవై – ఇరవై ఆరు వేల సంవత్సరాలు ప్రజా పరిపలన చేయాలి."

తర్వాత కథలో ధ్రువుడు మళ్ళీ వెనక్కి వెళ్ళి రాజ్యం చేసాడనీ చివరిలో తల్లితోపాటు విష్ణుపదం చేరాడనీ ధ్రువ చరిత్ర చెబుతోంది. ఎంతకష్టపడ్డా ఎన్నో జన్మలకి గానీ కనిపించని భగవంతుడు ధ్రువుడికి ఐదునెల్లలో ఎలా కనిపించేడు? దీనికి రెండు కారణాలు చెప్పుకోవచ్చు. ఒకటి – ధ్రువుడికున్న వయస్సూ, మనఃస్థితి, వాటినందుకోవడం అంత సులభం కాదు. ఉదాహరణకి నేను మీ ఇంటికి వచ్చి నాకు ఇలా ఇది కావాలి అని అడిగాననుకోండి. ఇస్తారా? పోనీ ఇస్తే మీరేమనుకుంటారు? "ఇంత వయసొచ్చీ ఈయన ఇలా అడుగుతున్నాడేమిటీ" అనుకోరూ? అదే మా అయిదేళ్ళ అబ్బాయ్ అడిగితే? వెంటనే సంతోషంగా తీసి ఇచ్చేయరూ? అదే ధ్రువుడి విషయంలో నిజమైంది. రెండు – రామకృష్ణ పరమహంస చెప్పిన కథ. భగవంతుడ్ని చూపిస్తారా అని అడిగేడుట ఒక బ్రహ్మజ్ఞానిని ఒకాయన. బ్రహ్మజ్ఞాని ఒక కొలను దగ్గిరకి తీసుకెళ్ళి ప్రశ్న అడిగినాయన తల నీట్లో ముంచి అలా ఉంచేడు ఓ నిముషం గాలి ఆడక గింజుకునేంతవరకూ. తల బయటకి తీయగానే "ఎలా ఉంది?" అని అడిగితే చెప్పాడుట, "ప్రాణం పోతోందనుకున్నానండి. ఎందుకలా ముంచారు?" అప్పుడు చెప్పేరుట బ్రహ్మ జ్ఞాని. "నువ్వు నీళ్ళలో తల ముంచినప్పుడు గాలి కోసం ఎలా అల్లల్లాడావో భగవంతుడి కోసం అలా తపించిననాడు ఆయన ఒక్క క్షణంలో కనిపిస్తాడు అని. ధ్రువుడికీ రెండు లక్షణాలూ సమృద్ధిగా ఉండడం వల్లే కనిపించేడు.

ధ్రువుడికి నోటమ్మట మాట ఎందుకురాలేదు శ్రీహరి కనిపించేక? దానికి రామకృష్ణ పరమహంస చెప్పిన మరో కథ చెప్పుకుందాం. ముగ్గురు మనుషులు అలా నడుస్తూ వెళ్తున్నారు. ఓ చోట పెద్ద గోడ కనిపించింది. ముగ్గురికీ ఆ గోడ వెనకాల ఏముందో తెల్సుకోవాలనిపించింది. ఇద్దరు సాయంపట్టి ఒకణ్ణి పైకి ఎక్కించారు. ఎక్కినాయన గోడమీదనుంచి అవతలకి చూసి "ఆ, ఆ" అని అటువేపు దూకేసాడు. ఇటువేపు ఉన్నవాళ్ళకి ఏమీ తెలియలేదు కానీ కుతూహలం ఎక్కువైంది. అప్పుడు రెండో ఆయన కూడా పైకి ఎక్కాడు. అయితే ఆయన కూడా "ఆ, ఆ" అని అటువైపు దూకేశాడు. మరి మూడోఆయనకెలా తెలుస్తుంది? మూడో ఆయన కూడా ఎలాగోలా పైకి ఎక్కాడు. అటువేపు చూడగానే "ఆ, ఆ" అని ఈయనకూడా అటువేపు దూకేశాడు. ఇంతకీ అటుపేపు ఏముంది? భగవద్దర్శనం అయితే అలాగే ఉంటుంది అంటారు రామకృష్ణులు. ఆయన అవ్యక్తుడు, అచ్యుతుడూను. ఆయన్ని ఎవరూ వర్ణించలేరు. ఆయన్ని చూడ్డం అంటే అలా గోడమీదనుంచి అటువేపు దూకేయడమే – అంటే అందులో లీనమవ్వడమే. ఎవరైతే బ్రహ్మన్ని నేను చూసానూ అని చెప్తారో వాళ్ళు తప్పకుండా చూడలేదని అర్థంట; ఎందుకంటే బ్రహ్మన్ని చూసినవాడికి బుద్ధీ, మనసూ పనిచేయడం మానేస్తాయి. అందుకే శ్రీహరి తన పాంచజన్యాన్ని ధ్రువుడికి తాకించేడు మాటరావడానికి. ఆయన స్పర్శ అటువంటిది.

చివరిగా ఇంకో విషయం. భగవద్గీతలో అర్జునుడు అడుగుతాడు, "తపస్సు చేస్తూ జీవిత కాలం సరిపోక క్షయం పొందేవాడు నరకానికి పోతాడా అని." కృష్ణుడు చెప్తాడు

పార్థ నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే

నహి కళాణ కృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి [భగవద్గీత 6.40]

నాయనా మంచి పనులు చేసేవాడు ఎన్నటికీ దుర్గతి పొందదు. ఇలాంటివాళ్ళు గొప్ప ఇళ్ళలో పుట్టి మళ్ళీ సాధన మొదలు పెడతారు అని (శుచీనాం శ్రీమతాంగేహే యోగభ్రష్టోభిజాయతే). ఈ ధ్రువుడు కూడా అటువంటివాడే అనిపిస్తుంది.

మొదట్లో సురుచి ధ్రువుడ్ని అలా సవతి కొడుకులా చూసినందుకు ఆవిడో శనిగ్రహం అని మీకు అనిపించిందా? ఆవిడే లేకపోతే ధ్రువుడు ఏమై ఉండేవాడు? సురుచి మంచిదై ఉండి ధ్రువుణ్ణి కూడా ఉత్తానపాదుడి తొడమీద కూర్చోబెట్టుకోవడానికి ఒప్పుకుని ఉంటే ఏమై

ఉండేది? ధ్రువుడు సురుచి వల్లే అత్యుత్తమమైన ఎవరికీ అందని విష్ణుపదం అందుకోగలిగేడు. అందువల్లే మనం ఇలా జన్మఎత్తడానికీ, భగవంతుడి వైపు “మెల్లిగా” ప్రయాణించడానికీ ఒక పథకం ప్రకారం పనులన్నీ జరుగుతూ ఉంటాయి. ఈ పథకం మన లెవెల్లోంచి చూస్తే పనికిరాని అర్థంలేని ప్రహేళికలా కనిపిస్తుంది. కానీ మన చుట్టుపక్కల మనతో ఉన్నవాళ్ళూ, మనం రోజూ కల్సుకునే వాళ్ళూ అందరూకూడా ఓ పథకం ప్రకారం మన కోసం అ–తి–జా–గ్ర–త్త–గా అమర్చబడ్డారు. ఎందుకంటే వీళ్ళతోనే మన అభివృద్ధి సులభతరం గానీ మనం ఎప్పుడో మూడో క్లాసులో ప్రేమించిన సుబ్బలక్ష్మితోటీ, ఎనిమిదో క్లాసులో పెళ్ళిచేసేసుకుంటానని శపథం చేసిన వరలక్ష్మితోటీ కాదు.

చిదానంద సరస్వతి గారంటారు, "ఈ ప్రపంచం ఎలా ఉంది? ఎలా ఉండాలో సరిగ్గా అలాగే ఉంది, బ్రహ్మాండంగా ఉంది." మన ఇష్ట ప్రకారం, మన అహంకారం ప్రకారం ఎప్పుడూ ఉండదు. ఉండకూడదు కూడా. ఎందుకంటే మన ఇష్ట ప్రకారం అన్నీ జరిగితే దానిమూలాన మన అభివృద్ధి కుంటుపడి ప్రపంచానికి ఎంతో కీడు జరుగుతుంది. “సర్వేజనా సుఖినోభవంతు” అన్నారు; ఒక్క మనిషి సుఖంగా ఉండడం కాదు ముఖ్యం. ప్రపంచం అంతా సుఖంగా ఉండాలి, ఎందుకంటే ఇలా ఉన్న ప్రపంచం వల్లే మన అభివృద్ధి సులభసాధ్యం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS